రైల్వే సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు బయలుదేరు రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

- 4.40 అమరావతి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - విజయవాడ
- 6.15 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - వైజాగ్
- 12.25 దేవగిరి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- సీఎస్ఎంటీ (ముంబాయి)
- 18.25 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- తిరుపతి
- 18.30 కోకనాడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - కాకినాడ (సోమ, బుధ, శుక్ర) (19.00 మంగళ, గురు, శని)
- 20.30 గౌతమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- కాకినాడ
- 21.05 నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- నర్సాపూర్
- 21.40 హంసఫర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి-ఇండోర్ (ఆదివారం)

రంజాన్ శుభాకాంక్షలు



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గ ముస్లిం సోదర, సోదరీమణులకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని అన్నారు. ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో రంజాన్ పండుగను చేసుకోవాలని కోరారు.

చెట్లు.. ఫుట్ఓవర్ బ్రిడ్జిలే.. బస్ షెల్టర్లు

అసలే ఎండాకాలం.. ఆపై భగభగలు ● ప్రయాణికులు అవస్థలు పడుతున్నా పట్టించుకోని అధికారులు



ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో చెట్ల కొమ్మల నీడలో నిలబడిన ప్రయాణికులు



ఫుట్ఓవర్ బ్రిడ్జి కింద నిలబడ్డ ప్రయాణికులు

హఫీజ్‌పేట్: బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు నానా ఇబ్బందులుపడుతున్నారు. ఎండాకాలం కావడంతో నీడ కోసం వెతుక్కుంటున్నారు. హఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్ల పరిధిలో ఆర్టీసీ బస్టాప్‌లలో ప్రయాణికులు నిలబడడానికి షెడ్డు కూడా లేకపోవడంతో చెట్టు కొమ్మలు, ఫుట్ఓవర్ బ్రిడ్జి, దుకాణాల ముందు ఉన్న నీడలో ప్రయాణికులు నిల్చునే పరిస్థితి నెలకొంది. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ చౌరస్తా మొదలు ఓల్డ్ హఫీజ్‌పేట్, న్యూహఫీజ్‌పేట్, సీఆర్ ఫౌండేషన్, మదీనాగూడ దీప్తిశ్రీనగర్, గంగారం, చందానగర్ బస్టాప్‌ల వద్ద నీడ లేక ప్రయాణికులు చెట్టు కింద నిలబడి బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. వేసవి కాలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న తరుణంలో ప్రయాణికుల బాధలు చెప్పనక్కర్లేదు. చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులు బస్సుల కోసం రోడ్డుపై పరుగెత్తుతుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆర్టీసీ, జీహెచ్ఎంసీ అధికారులు షెడ్డులను నిర్మించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

- ఓల్డ్ హఫీజ్‌పేట్, న్యూ హఫీజ్‌పేట్‌లోని ఆదిత్యనగర్ ఇరువైపులా, సీఆర్ ఫౌండేషన్, మదీనాగూడ దీప్తిశ్రీనగర్‌లలో బస్‌షెల్టర్‌లను ఏర్పాటు చేయాలి.
- ఆర్టీసీ బస్సులు ఇష్టానుసారంగా నిలుపకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి కేవలం బస్టాప్‌లలో నిలిపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి
- ఆర్టీసీ బస్సులు వచ్చే సమయాలకు సంబంధించి సూచిక బోర్డులను ఉంచాలి
- కొన్ని బస్టాప్‌ల పక్కన దుకాణాల వల్ల స్టాప్ కనబడకుండా పోతుంది. వెంటనే వాటిని అధికారులు తొలగించాలి
- బస్టాపులలో బెంచీలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డుపైన బస్సులు ఆపుతున్నారు



ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో ఇరువైపులా బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలి. చెట్టు కొమ్మల కింద బస్సు కోసం నిలబడుతున్నాం. ఆర్టీసీ బస్సులు బస్టాప్‌లలో ఆపకుండా రోడ్డుపైనే ఆపుతుండడంతో ఏం ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం. ఇప్పటికైన అధికారులు స్పందించాలి. – మనోజ్, ఓల్డ్ హఫీజ్‌పేట్

తాగునీరు అందుబాటులో ఉంచాలి



ఎండాకాలం బస్టాప్‌లలో ప్రయాణికుల దాహార్తి కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రతి బస్టాప్‌లో తాగునీరు అందుబాటులో ఉంచాలి. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి బస్టాప్‌లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. –సయ్యద్, న్యూ హఫీజ్‌పేట్

షాపింగ్‌మాల్స్ ఎదుట అక్రమ పార్కింగ్ తొలగింపు



షాపింగ్‌మాల్ ముందు రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన పార్కింగ్‌ను తొలగించిన అధికారులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ నుంచి వివేకానందనగర్ కమాన్ వరకు ఉన్న పలు షాపింగ్‌మాల్స్ రోడ్డును ఆక్రమించి పార్కింగ్ ఏర్పాటు చేసుకోవడంతో రోజు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారని స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏకాంత్ గౌడ్ కూకట్‌పల్లి జోనల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు స్పందించలేదు. దీంతో హైకోర్టులో కేసు వేశారు. ఈ మేరకు కూకట్‌పల్లి సర్కిల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, షాపింగ్‌మాల్ వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన పార్కింగ్‌ను తొలగించారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రంజాన్ పండగ సందర్భంగా రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఈద్గా పరిసరాలను శుభ్రం చేశారు. ఈ పనులను కార్పొరేటర్ పుష్పనగేష్ పరిశీలించారు. నాయకులు హబీబ్, నయీమ్, అక్బర్, అఖిల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

'సీతారాముల తలంబ్రాలు ఇంటి వద్దకే'

మూసాపేట: భద్రాచలం సీతారాముల తలంబ్రాలను ఇంటికే అందజేస్తామని కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్ఎం కవిత తెలిపారు. బుధవారం కూకట్‌పల్లి ఆర్‌టిసి డిపోలో కార్గో ద్వారా సీతారాముల తలంబ్రాలు ఇంటి వద్దకే అనే పోస్టర్‌ను ఆమె డిపో మేనేజర్ మహ్మద్ ఇషాక్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతారాముల తలంబ్రాలను కోరుకునే భక్తులు కూకట్‌పల్లి డిపో టిఎస్‌ఆర్‌టిసి లాజిస్టిక్స్ కేంద్రంలో 151 రూపాయలు చెల్లించి బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 18వ తేదీ వరకే బుక్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జమ్మన్నను నేరుగా లేదా 9154298824, 9154298839 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సామాజిక సేవలో ఉండే ఆనందం మరెందులో ఉండదని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం తెల్లాపూర్‌లో మందాడ నరేందర్‌రెడ్డి తన తండ్రి స్వర్గీయ రంగారెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ తెల్లాపూర్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు తూర్పు శ్రీనివాస్, నాయకులు కృష్ణ, రాజేష్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వాజీద్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెమ్యూనరేషన్ చెల్లించాలని వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈ ఏడాది పదవ తరగతి మూల్యాంకన రెమ్యునరేషన్, గత ఏడాది పెండింగ్‌లో ఉన్న డబ్బును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం బెల్ టౌన్‌షిప్‌లోని జ్యోతి విద్యాలయంలోని 10వ తరగతి మూల్యాంకన కేంద్రంలోని డిప్యూటీ క్యాంపు అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ గత ఏడాది డబ్బులు సైతం అలస్యంగా ఇచ్చారని తెలిపారు. ఈ ఏడాది తొందరగా రెమ్యూనరేషన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, నాయకులు చక్రవర్తి, శ్రీశైలం, ప్రభాకర్, రాజు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



ఆల్విన్‌కాలనీ: రజక సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చాగంటి అశోక్, డివిజన్ మాజీ అధ్యక్షుడు జిల్లా గణేష్ నేతతో కలిసి బుధవారం సంఘం కేలండర్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరి చిన్నోళ్ల శ్రీను, డివిజన్ అధ్యక్షుడు శ్రీను రజక, వెంకటయ్య, సరసయ్య, ఆంజనేయులు, బంగారయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

13 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 13 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 13 మందికి ఒక్కొక్కరికీ రూ. 2 వేల జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ కల్వగడ్డ రాజ్‌కుమార్ ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజ్, దయాకర్, గోపి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామంలోని 181 సర్వేనంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను బుధవారం రెవెన్యూ అధికారులు జేసీబీలతో కూల్చివేయించారు. తహశీల్దార్ బిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ నిర్మాణాలను కూల్చివేయించారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆర్ఐ హెచ్చరించారు.

వైభవంగా రంగనాథుడి ఉత్సవాలు



రంగనాథస్వామి పల్లకిసేవ

రాయదుర్గం: గోపన్‌పల్లి రంగనాథుడి ఉత్సవాలు రెండవ రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయ సమీపంలోని శ్రీరంగ సింగబావి వద్దకు తీసుకెళ్లి అక్కడ అవభృత స్నానం చేయించి ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచే ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. రంగనాథస్వామిని పలువురు ప్రజా ప్రతినిధులు , నాయకులు దర్శించుకున్నారు. ఆలయంలో పంచాంగ పఠనం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీంద్రప్రసాద్ దూబే, పోచయ్య పాల్గొన్నారు.



స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు

నీటి వ్యాపారంపై రెవెన్యూ కొరడా

- ఖానాపూర్‌లో 18 బోర్లు సీజ్
- నీటి గుంతల పూడ్చివేత



ఖానాపూర్‌లో బోర్లను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

మణికొండ: విచ్చలవిడిగా సాగుతున్న నీటి వ్యాపారంపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. గండిపేట మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో వ్యవసాయం పేరిట బోర్లు, విద్యుత్ కనెక్షన్‌లు తీసుకుని ఇష్టారాజ్యంగా ట్యాంకర్లకు నీటిని అమ్ముకుంటున్నారు. దీంతో చుట్టుపక్కల పొలాలతో పాటు ఇళ్లలోని బోర్లు ఎండిపోతున్నాయి. గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేయటంతో స్పందించిన తహసీల్దార్ నర్రా శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో బుధవారం ఏకంగా 18 బోర్లను సీజ్ చేశారు. బోర్ల నుంచి నీటి నిల్వకు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక సంప్‌లను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వాల్టా చట్టం ప్రకారం నీటి వ్యాపారం నిషేధమని, భూములు ఉన్న వారు వ్యవసాయం మాత్రమే చేసుకోవాలన్నారు. సీజ్ చేసిన బోర్లను తిరిగి ఉపయోగిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయటంతో పాటు విద్యుత్ సర్వీసులను తొలగించాలని విద్యుత్ శాఖకు లేఖ రాస్తామన్నారు.

ఈద్గాలో ఏర్పాట్లు పూర్తి



హైదర్‌నగర్‌లోని ఈద్గా ఆవరణను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌లో రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గా వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఈద్గా కమిటీ సభ్యులతో బుధవారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా సామూహిక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు షరీఫ్, హమీద్, హబీబ్, ఫిరోజ్‌ఖాన్, ఖలీం, జమీరుద్దీన్, ఫసియుద్దీన్, రహమాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి, భూదేవి హిల్స్‌లోని షాలేం ఎవాంజిలికల్ చర్చ్‌లో పాస్టర్ శ్యామ్ జాషువా మధిర ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ పాస్టర్స్ సమావేశంను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సిహెచ్.భాస్కర్, యాదగిరి, గోపాల్, సంగారెడ్డి, రాజు, పాస్టర్లు సత్యరాజు, సురేష్, నాగభూషణం, ఆండ్రూస్, రవిబాబు, జార్జ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన చేవెళ్లలో మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగే బీఆర్ఎస్ బహిరంగ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సమిష్టిగా పనిచేయాలన్నారు. బూతు స్థాయి నుంచి నాయకులు మెజార్టీ సాధనే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మోహినీ భస్మాసుర నాటకం

ఫిలింనగర్: ఉగాది పద్య నాటకోత్సవాల్లో భాగంగా పొత్తూరు వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటికలు ఆకట్టుకుంటున్నాయి. ఫిలిం ఛాంబర్ ఆవరణలోని రామానాయుడు కళామండపంలో బుధవారం మోహిని భస్మాసుర పౌరాణిక పద్య నాటకాన్ని ఉషోదయ నాట్య కళామండలి నటులు ప్రదర్శించారు. రెండున్నర గంటల పాటు సాగిన ఈ నాటకాన్ని కళాకారులు రక్తికట్టించారు. గయోపాఖ్యాన యుద్ధ సన్నివేశంలో శ్రీకృష్ణుడిగా బంగారు కంకణ గ్రహీత ఎం.రామలింగేశ్వరరావు, అర్జునుడిగా ఉప్పాల రాజేశ్వర్‌రావు భస్మాసురుడిగా మొగిలిపువ్వు వెంకటసుబ్బయ్య, నారదుడిగా అసోది అక్కిరెడ్డి, శంకరుడిగా కేసన నాగేశ్వర్‌రావు, విష్ణుమూర్తిగా కొప్పరపు శ్రీనివాసరావు, చిక్కాసురిడిగా ఆరాధ్యుల శ్రీనివాసరావు, డక్కాసురిడిగా మర్రివాడ సుబ్బారావు, లక్ష్మీగా సురభిజ్యోతి, మోహినిగా తిరుమలాబి ,భృంగీశ్వరుడిగా బొక్కసం సత్యనారాయణ నటించారు. ఈ నాటికకు హార్మోనియం సి.హెచ్.శ్రీనివాసరావు, డోలక్ బాపిరెడ్డి, ఆహార్యం వెంకటస్వామి సహకారం అందించారు. వీనుల విందుగా సాగిన ఈ నాటకాన్ని కళాభిమానులు వీక్షించి పరవశించిపోయారు.

పాపిరెడ్డినగర్ కాలనీలో బీజేపీ ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆల్విన్‌కాలనీ: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ కాలనీలో బుధవారం డివిజన్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్, కన్వీనర్ రాఘవేంద్రరావు, కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, నరేష్, నరేందర్‌రెడ్డి, మణిభూషణ్, కేశవ్‌లు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ దేశం బాగుండాలంటే మళ్లీ మోడీ సర్కార్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ ముఖ్య నాయకులు, డివిజన్ పదాధికారులు, మహిళామోర్చా, యువమోర్చా, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరాహిల్స్ కాలనీలో ఎమ్మెల్యే పాదయాత్ర



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరాహిల్స్ కాలనీలో బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, తక్కువ ప్రెషర్‌తో నీరు సరఫరా అవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకురాగా జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను కోరారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, పైపులైన్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌యస్ పార్టీ మాజీ అధ్యక్షుడు జిల్లా గణేష్, నాయకులు కాశీనాద్ యాదవ్, చిన్నోళ్ల శ్రీనివాస్, రాజు, మల్లేష్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకర్లు స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: ఇష్టానుసారంగా భూగర్భ జలాలు వెలికి తీస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా భూగర్భజల శాఖ అధికారి సంతోష్‌కుమార్ అన్నారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న దృష్ట్యా ఆ శాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. చిట్కుల్ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా రవాణా చేస్తున్న ఆరు నీటి ట్యాంకర్లను స్వాధీనం చేసుకొని పటాన్‌చెరు పోలీసులకు అప్పచెప్పారు. భూగర్భ జలాల లభ్యతను బట్టి ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్లను అనుమతిస్తామని సంగారెడ్డి జిల్లా భూగర్భ జలశాఖ అధికారి సంతోష్‌కుమార్ తెలిపారు వ్యవసాయ బోర్ల నుంచి అక్రమంగా తరలించవద్దని,అనుమతి లేకుండా పరిశ్రమలకు, ఇతర అవసరాలకు వెలికి తీయవద్దని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో పటాన్‌చెరు ఆర్ఐ ఖాజా మొయినుద్దీన్ పాల్గొన్నారు.

దుబ్బాకలో చెల్లని రఘునందన్ పటాన్‌చెరులో చెల్లుతాడా?

మాజీ మంత్రి హరీశ్‌రావు



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

పటాన్‌చెరు టౌన్: మెదక్ గడ్డ బీఆర్ఎస్ అడ్డా అని ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. 2004 నుంచి ఇక్కడ బీఆర్ఎస్ హవా కొనసాగుతుందన్నారు. ఈసారి కూడా గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం.. గణేశ్‌గడ్డ దేవస్థానం వద్ద ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, సునీతారెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచార రథాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడారు. దుబ్బాకలో చెల్లని రఘునందన్.. పటాన్‌చెరులో చెల్లుతాడా ?అని ఈ సందర్భంగా ప్రశ్నించారు. రైలు బండి, ఆస్పత్రి ఏర్పాటు చేస్తానని హామీలు ఇచ్చి మోసం చేసిన ఆయన్ని చిత్తుగా ఓడించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు జాతకం నాకన్నా మీకే ఎక్కువ తెలుసని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి స్థానికుడు కాదని దుష్ప్రచారం చేస్తున్నారని, తెల్లాపూర్‌లో ఉమ్మడి కుటుంబంతో నివాసం ఉంటున్నాడన్నారు. ఇలాంటి విద్యావంతుడిని గెలిపించుకుంటే ఎంతో మేలు జరుగుతుందన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపిస్తాడని తెలిపారు. దుబ్బాకకు చెందిన అనాథ పిల్లలు సహాయం కోసం వస్తే ఆదుకున్నారన్నారు. పటాన్‌చెరు అభివృద్ధి గురించి కాలుష్య నివారణ కోసం, మెట్రో పొడిగింపు కోసం కృషి చేస్తాడన్నారు. గణేష్ గడ్డ మనకు అచ్చొచ్చిన గడ్డ అన్నారు. ఇక్కడ మూడు సార్లు ఎమ్మెల్యే ఎన్నికల్లో మహిపాల్ రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, వాహనాలను ప్రారంభించామని, ఎన్నికల్లో ఘన విజయం సాధించామని పేర్కొన్నారు. ఇవాళ వెంకట్రాంరెడ్డితో కలిసి పూజలు నిర్వహించామని మరోసారి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ, కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌గా 11 ఏళ్లు ప్రజలతో మమేకమై పనిచేశానన్నారు. ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లో వస్తున్నానని తనను ఆశీర్వదించాలని అండగా ఉంటానని అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్ వాసినని, ఏ కష్టం వచ్చినా పిలవగానే వచ్చి ఆదుకుంటానన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రికార్డు మెజార్టీ అందిస్తాం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: లోక్‌సభ ఎన్నికల్లో పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డికి రికార్డు మెజార్టీ అందిస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధికి ప్రతీకగా నిలిపామని తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీకి బలమైన క్యాడర్ ఉందన్నారు. ప్రతి కార్యకర్త గడపగడపకు వెళ్లి వెంకట్రాంరెడ్డి విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.